# సిరియాదే ఇంటర్‌కాంటినెంటల్ కప్



- భారత్‌కు ఘోర పరాభవం

హైదరాబాద్, ఆట ప్రతినిధి: మూడు దేశాలు పాల్గొన్న ఇంటర్‌కాంటినెంటల్ కప్‌ను సిరియా గెలుచుకుంది. హైదరాబాద్‌లోని జీఎంసీ బాలయోగి అథ్లెటిక్స్ స్టేడియం వేదికగా సోమవారం జరిగిన చివరి మ్యాచ్‌లో సిరియా.. 3-0తో భారత్‌ను ఓడించి తొలి సారి ఈ కప్‌ను కైవసం చేసుకుంది. సిరియా తరఫున మహ్మద్ అల్ అస్వద్ 2వ నిమిషంలోనే గోల్ చేయగా రెండో అర్ధభాగం 77వ నిమిషంలో డలెహా మోహ్సెన్ రెండో గోల్ చేసి ఆ జట్టుకు తిరుగులేని ఆధిక్యాన్ని అందించాడు. ఆట మరికొద్ది (90+6) క్షణాల్లో ముగుస్తుందనగా పాబ్లో సబ్బగ్ మూడో గోల్ కొట్టి విజయాన్ని పరిపూర్ణం చేశాడు. తొలి మ్యాచ్‌లో మారిషస్‌ను 2-0తో ఓడించిన సిరియా.. భారత్‌కూ షాకిచ్చింది. 2019 ఇంటర్‌కాంటినెంటల్ కప్‌లో మూడో స్థానంలో నిలిచిన సిరియా.. ఈసారి మాత్రం భారత్‌ను ఓడించి ట్రోఫీ ఎగురేసుకుపోయింది. ఫుట్‌బాల్ ర్యాంకింగ్స్‌లో భారత్ (124) కంటే మెరుగైన ర్యాంకు కలిగినా సిరియా (93)కు భారత గడ్డపై ఓ మేజర్ టైటిల్ నెగ్గడం ఇదే ప్రథమం. ముగింపు కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ట్రోఫీ అందజేశారు.

# బై బై పారిస్..

**ఘనంగా ముగిసిన పారాలింపిక్స్ ముగింపు వేడుకలు**

**మార్చ్‌పాస్ట్‌లో పతాకధారులుగా హర్విందర్, ప్రీతి**



పారిస్: ప్రతిష్ఠాత్మక పారిస్ పారాలింపిక్స్ గేమ్స్ అట్టహాసంగా ముగిశాయి. ప్రపంచవ్యాప్తంగా క్రీడాభిమానులను అలరించిన పారాలింపిక్స్‌కు ఆదివారం అర్ధరాత్రి(భారత కాలమానం ప్రకారం) తెరపడింది. చారిత్రక స్టేట్ డీ ఫ్రాన్స్ స్టేడియం వేదికగా పారాలింపిక్స్ ముగింపు వేడుకలు ఘనంగా జరిగాయి. దాదాపు 60వేల మంది ప్రేక్షకుల సమక్షంలో వైవిధ్యమైన సాంస్కృతిక కార్యక్రమాలు కట్టిపడేశాయి. ఓవైపు వరుణుడు అంతరాయం కల్గించినా.. ఫ్రాన్స్‌కు చెందిన టాప్-20 డీజేలు రూపొందించిన పాటలతో స్టేడియం హోరెత్తిపోయింది. అథ్లెట్లు చిరకాలం గుర్తుండిపోయేలా ప్రముఖ మ్యూజిక్ కంపోజర్ జీన్ మిచెల్ జారె, కాసియస్ పాటలను అభిమానులు బాగా ఆస్వాదించారు. అంతకముందు జరిగిన మార్చ్‌పాస్ట్‌లో 169 దేశాలకు చెందిన పారా అథ్లెట్లు జాతీయ జెండాలు పట్టుకుని ముందుకు నడిచారు. భారత్ తరఫున హర్విందర్‌సింగ్, ప్రీతిపాల్..పతాకధారులుగా వ్యవహరించారు. పారిస్ మేయర్ అన్నె హిడాల్గో పారాలింపిక్స్ జెండాను అంతర్జాతీయ పారాలింపిక్ కమిటీ అధ్యక్షుడు ఆండ్రూ పార్సన్‌కు అందజేయగా, అతను లాస్ ఏంజెల్స్ మేయర్ కారెన్ బస్‌కు ఇచ్చారు. ముగింపు వేడుకల్లో పారాలింపిక్స్ జెండాను అందుకున్న తొలి నల్లజాతి మేయర్‌గా కారెన్ నిలిచారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమాన్యుయల్ మక్రాన్ ముగింపు వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

## హైదరాబాద్‌లో పీకేఎల్

న్యూఢిల్లీ: ప్రో కబడ్డీ లీగ్(పీకేఎల్) 11వ సీజన్‌కు రంగం సిద్ధమైంది. ఇప్పటికే పది ఎడిషన్ల ద్వారా క్రీడాభిమానులకు దగ్గరైన పీకేఎల్ సరికొత్త ఉత్సాహంతో ముందుకు రాబోతున్నది. హైదరాబాద్ గచ్చిబౌలి ఇండోర్ స్టేడియం వేదికగా అక్టోబర్ 18 నుంచి పీకేఎల్ సీజన్‌కు తెరలేవనుంది. లీగ్ షెడ్యూల్‌ను నిర్వాహకులు సోమవారం విడుదల చేశారు. తెలుగు టైటాన్స్, బెంగళూరు బుల్స్ మధ్య తొలి మ్యాచ్ జరుగనుంది.

# లంక అదుర్స్

- ఇంగ్లండ్‌పై ఆఖరి టెస్టులో విజయం



లండన్: ఇంగ్లండ్ పర్యటనలో శ్రీలంకకు చిరస్మరణీయ విజయం దక్కింది. తొలి రెండు టెస్టులూ ఓడిన లంకేయులు.. లార్డ్స్ వేదికగా జరిగిన చివరి టెస్టులో మాత్రం ఆతిథ్య జట్టుకు షాకిచ్చారు. రెండో ఇన్నింగ్స్‌లో ఇంగ్లిష్ జట్టు నిర్దేశించిన 219 పరుగుల ఛేదనలో నాలుగో రోజు ఓవర్ నైట్ స్కోరు 94/1తో ఆట ఆరంభించిన లంకకు పతుమ్ నిస్సంక (127 నాటౌట్), కుశాల్ మెండిస్ (39), ఏంజెలో మాథ్యూస్ (32 నాటౌట్) రాణించడంతో ఆ జట్టు 8 వికెట్ల తేడాతో విజయం సాధించింది.

# జపాన్‌పై భారత్ జయభేరి

- ఏషియన్ చాంపియన్స్ ట్రోఫీ



హులన్‌బుయిర్ (చైనా): ఏషియన్ చాంపియన్స్ ట్రోఫీ హాకీలో డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగిన భారత్ వరుస విజయాలతో దూసుకుపోతోంది. తొలి మ్యాచ్‌లో 3-0తో చైనాను చిత్తుచేసిన భారత్.. సోమవారం 5-1తో జపాన్‌పై జయభేరి మోగించింది. భారత్ తరఫున సుఖ్‌జీత్ సింగ్ 2, 60వ నిమిషాలలో రెండు గోల్స్ సాధించగా అభిషేక్ (3), సంజయ్ (17), ఉత్తమ్ సింగ్ (54) తలా ఓ గోల్స్ చేశారు. జపాన్ నుంచి మత్సుమొటో కజుమస ఒక్కడే 41వ నిమిషంలో గోల్ కొట్టగలిగాడు. మ్యాచ్ ఆరంభం నుంచే అదరగొట్టిన భారత్.. జపాన్‌పై విజయంతో సెమీస్ బెర్తును దాదాపుగా ఖాయం చేసుకుంది. ఆరు జట్లు తలపడుతున్న ఈ టోర్నీ పాయింట్ల పట్టికలో టాప్-4లో నిలిచిన జట్లు సెమీస్‌కు అర్హత సాధిస్తాయి.



# విన్నర్ సిన్నర్

**యూఎస్ ఓపెన్ మెన్స్ సింగిల్స్ టైటిల్ కైవసం**

**ఫైనల్‌లో అమెరికా కుర్రాడు చిత్తు**



న్యూయార్క్: ఇటలీ యువ సంచలనం జన్నిక్ సిన్నర్ యూఎస్ ఓపెన్‌లో పురుషుల సింగిల్స్ విన్నర్‌గా నిలిచాడు. ఈ ఏడాది ఆరంభంలో ఆస్ట్రేలియా ఓపెన్ నెగ్గి సంచలనం సృష్టించిన సిన్నర్.. తాజాగా సీజన్ చివరి గ్రాండ్‌స్లామ్ టోర్నీ అయిన యూఎస్ ఓపెన్‌నూ సొంతం చేసుకున్నాడు. న్యూయార్క్‌లోని ఆర్థర్ ఆషే స్టేడియం వేదికగా జరిగిన యూఎస్ ఓపెన్ మెన్స్ సింగిల్స్ ఫైనల్‌లో సిన్నర్ 6-3, 6-4, 7-5తో అమెరికా కుర్రాడు టేలర్ ఫ్రిట్జ్‌ను ఓడించాడు. రెండు గంటలా 16 నిమిషాల పాటు సాగిన ఈ పోరులో వరుస సెట్లలో ఫ్రిట్జ్‌ను చిత్తుచేసిన సిన్నర్.. నోవాక్ జొకోవిచ్, రోజర్ ఫెదరర్, రఫెల్ నాదల్ తర్వాత ఒకే ఏడాది హార్డ్ కోర్ట్స్ (ఆస్ట్రేలియా, యూఎస్)లో టైటిల్స్ గెలిచిన నాలుగో ఆటగాడిగా రికార్డులకెక్కాడు. ఫైనల్ పోరులో 29 విన్నర్లు కొట్టిన సిన్నర్.. 10 ఏస్‌లు సంధించాడు. ఫ్రిట్జ్ 6 ఏస్‌లు, 23 విన్నర్లు మాత్రమే కొట్టగలిగాడు. అద్భుత పోరాటపటిమతో ఎదురైన ప్రత్యర్థినల్లా ఓడిస్తూ ఫైనల్ చేరిన ఫ్రిట్జ్.. తుదిపోరులో సొంత ప్రేక్షకుల ఎదుట మాత్రం తేలిపోయాడు.

ఈ ఏడాది ఫ్రెంచ్ ఓపెన్, వింబుల్డన్ టైటిల్స్‌ను అల్కారజ్ గెలుచుకోగా ఆస్ట్రేలియా, యూఎస్ ఓపెన్‌లలో సిన్నర్ విజేతగా నిలవడం విశేషం. ఈ ఇద్దరూ 23 ఏండ్ల లోపు వారే కావడం గమనార్హం. 1993 తర్వాత ఇలా జరగడం ఇదే తొలిసారి.

**ప్రైజ్ మనీ**

| | |
|---|---|
| జన్నిక్ సిన్నర్: | 3,600,000 యూఎస్ డాలర్లు |
| భారత కరెన్సీలో సుమారు | రూ. 30.23 కోట్లు |

# షూటర్ల పతకాల మోత

**డెఫ్ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో మెరిసిన భారత్**



ఢిల్లీ: జర్మనీలోని హనోవర్ వేదికగా జరిగిన వరల్డ్ డెఫ్ (వినికిడి లోపం ఉన్న వారు) షూటింగ్ చాంపియన్‌షిప్స్‌లో భారత షూటర్లు అదరగొట్టారు. ఈ టోర్నీలో 7 స్వర్ణా లు, 7 రజతాలు, 7 కాంస్యాలతో మొత్తంగా 21 పతకాలు సాధించి పతకాల పట్టికలో అగ్రస్థానంలో నిలిచినట్టు భారత జాతీయ రైఫిల్ సమాఖ్య (ఎన్ఆర్ఏఐ) తెలిపింది. 18 పతకాలతో ఉక్రెయిన్ రెండో స్థానంలో నిలిచింది. 15 క్రీడాంశాలలో పాల్గొన్న 13 మంది భారత షూటర్లు పతకాల మోత మోగించారు. పిస్టల్ షూటర్ అభినవ్ దేశ్వాల్ ఒక స్వర్ణం, నాలుగు రజతాలతో అత్యధిక పతకాలు సాధించిన షూటర్‌గా నిలిచాడు.

# టెన్నిస్‌లో ఇటాలియన్ల ముద్ర

*నమస్తే తెలంగాణ క్రీడావిభాగం*

గత ఏడాదికాలంగా టెన్నిస్‌లో ఇటలీ ప్లేయర్లు అంచనాలకు మించి రాణిస్తున్నారు. ఈ ఏడాది తొలి గ్రాండ్‌స్లామ్ ఆస్ట్రేలియా ఓపెన్ గెలిచి ఇటలీకి తొలి మెన్స్ సింగిల్స్ టైటిల్ అందించిన సిన్నర్.. తాజాగా యూఎస్ ఓపెన్ సైతం గెలిచి చరిత్ర సృష్టించాడు. 2015లో ఇటలీకి చెందిన ఫ్లావియా పెన్నెట్ట తర్వాత ఆ దేశం తరఫున యూఎస్ ఓపెన్ గెలిచిన రెండో వ్యక్తిగా సిన్నర్ నిలిచాడు. సిన్నర్‌తో పాటు లొరెంజో ముసెట్టి సైతం పురుషుల సింగిల్స్‌లో రాణిస్తున్నాడు. మహిళల సింగిల్స్‌లో జాస్మిన్ పలోని సంచలన విజయాలతో దూసుకుపోతోంది. ఈ ఏడాది ఫ్రెంచ్ ఓపెన్, వింబుల్డన్‌లో ఆమె రన్నరప్‌గా నిలవగా యూఎస్ ఓపెన్‌లోనూ ప్రిక్వార్టర్స్ చేరింది. ఇటీవలే ముగిసిన పారిస్ ఒలింపిక్స్‌లో పలోని.. డబుల్స్‌లో సారా ఎర్రానితో కలిసి స్వర్ణం గెలిచింది. ఇదే ఈవెంట్‌లో ముసెట్టి కాంస్యం నెగ్గాడు. ఇక యూఎస్ ఓపెన్‌కు ముందే డోపింగ్ ఆరోపణలు చుట్టుముట్టడంతో ఒకింత ఒత్తిడితోనే టైటిల్ వేటను ఆరంభించిన సిన్నర్.. ఎక్కడా ఏకాగ్రత చెదరకుండా 23 ఏండ్లకే రెండో గ్రాండ్‌స్లామ్‌ను ఒడిసిపట్టాడు. వీరి దూకుడుతో టెన్నిస్‌లో ఇటలీ ఆధిపత్యం క్రమంగా పెరుగుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# మాటిమాటికీ కెప్టెన్లను మార్చకండి

- పీసీబీకి హెడ్‌కోచ్‌ల వినతి!

కరాచీ: పాకిస్థాన్ క్రికెట్ జట్టులో కెప్టెన్లను పదే పదే మార్చడంపై ఆ జట్టు పరిమిత ఓవర్ల, టెస్టు హెడ్‌కోచ్ పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ)కు చెప్పినట్టు సమాచారం. అపజయాలు వెంటాడుతున్నా కెప్టెన్లపై నమ్మకముంచాలని ఈ ఇద్దరూ పీసీబీకి విన్నవించినట్టు తెలుస్తోంది. వన్డే ప్రపంచకప్‌లో గ్రూప్ దశలోనే పాక్ నిష్క్రమించాక బాబర్ ఆజమ్‌ను సారథ్య బాధ్యతల నుంచి తప్పించిన పీసీబీ.. షాహిన్ షా అఫ్రిదిని, టెస్టు జట్టుకు షాన్ మసూద్‌ను సారథులుగా నియమించింది. ఇక ఈ ఏడాది న్యూజిలాండ్ చేతిలో టీ20 సిరీస్‌లో దారుణంగా ఓడాక అఫ్రిదినీ తప్పించి తిరిగి ఆ బాధ్యతలను బాబర్‌కే అప్పగించింది.

# శభాష్ పారా ప్లేయర్లు

**పారాలింపిక్స్ పతక విజేతలకు గోపీచంద్ అభినందన**

హైదరాబాద్, ఆట ప్రతినిధి: పారిస్ పారాలింపిక్స్‌లో పతకాలు సాధించిన దీప్తి జివాంజీ, నితీశ్‌కుమార్, రజితను జాతీయ బ్యాడ్మింటన్ చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్ ప్రత్యేకంగా అభినందించారు. సోమవారం సాయ్ బ్యాడ్మింటన్ అకాడమీలో పారా అథ్లెట్లకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గోపీచంద్ మాట్లాడుతూ 'విశ్వక్రీడా వేదికపై పారా అథ్లెట్లు పతకాలతో సత్తాచాటి దేశానికి గర్వకారణంగా నిలిచారు. సాధారణ అథ్లెట్లకు తాము ఏమీ తీసిపోమని వారు చేతల్లో చూపెట్టారు. ప్రతిష్ఠాత్మక టోర్నీలో రాణించడం కోసం వారు ఎన్నో ఒడిదొడుకులు ఎదుర్కొన్నారు. భవిష్యత్‌లో మీరు మరిన్ని విజయాలు సాధించాలి' అని అన్నారు.




Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.